నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 11 జనవరి 2024 | NIRMAL

మెరుగైన వైద్యం అందించాలి..

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

ఓపీ వార్డును పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్వీ కర్ణన్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 10 : ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ దవాఖానతో పాటు, ఎంసీహెచ్, మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐసీయూ జనరల్, ఆరోగ్య శ్రీ, డయాగ్నోస్టిక్ సెంటర్‌ను పరిశీలించారు. డయాలసిస్, ఐసీయూ కేంద్రాల నిర్వహణను సరి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట జాయింట్ డైరెక్టర్లు పద్మజ, శ్రీనివాస్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, ప్రిన్సిపాల్ ప్రసాద్, సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు జీతాలివ్వండి..

మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

భీంపూర్, జనవరి 10 : విద్యాశాఖలో విశేష సేవలందిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో రూ.31 లక్షలతో నిర్మించిన ఎమ్మార్సీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఆర్పీ, సీసీవో, ఎంఐఎస్, ఐఆర్పీ, కేజీబీవీ ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిసి వేతనాల మంజూరుకు కృషి చేయాలని కోరారు. ఈ సంక్రాంతి పండుగకు తాను సొంతంగా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం భీంపూర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, అక్కడే భోజనం చేశారు. ఆయన వెంట జడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ, వైస్ ఎంపీపీ లస్మన్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో శ్రీకాంత్, డీఈ శంకర్, డీటీ హరీశ్ ఉన్నారు.

ఆగిన అద్దె చక్రం

కేంద్రం నిర్ణయానికి నిరసనగా నిలిచిన ఆర్టీసీ బస్సులు

- ఆందోళన నిర్వహించిన డ్రైవర్లు.. ప్రయాణికుల అవస్థలు..
- బస్సులు నడవక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లని విద్యార్థులు
- కేంద్రంపై అద్దె బస్సుల యూనియన్ నాయకుల నిప్పులు
- హిట్ అండ్ రన్ చట్టాన్ని సవరించాలని డిమాండ్
- కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడుతాయని ఆవేదన

ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఆదిలాబాద్, జనవరి 10(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఫలితంగా జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల పరిధిలో గల 75 బస్సులు నిలిచిపోయాయి. బుధవారం ఉదయం డిపోల వద్ద డ్రైవర్లు బస్సులు నడుపకుండా ఆందోళనకు దిగడంతో.. ఆదిలాబాద్ డిపోలోని 59, ఉట్నూర్ డిపోలోని 16 అద్దె బస్సులు రవాణా సాగించలేదు. ఆందోళన కారణంగా ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల నుంచి కరీంనగర్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలతోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు నడవలేదు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు.

కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం

అద్దె బస్సుల డ్రైవర్లతో ఆదిలాబాద్ ఆర్టీసీ అధికారులు చర్చించినా ఫలితం కనిపించలేదు. కేంద్ర ప్రభుత్వ తీరుపై అద్దె బస్సుల యూనియన్ నాయకులు, డ్రైవర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలనీ వేతనాలతో తాము పనిచేస్తున్నామని, బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం ఫలితంగా ప్రమాదాలు జరిగితే తాము పదేండ్లు జైలులో ఉండాల్సి వస్తున్నదని, తమ కుటుంబాలు వీధి పాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు చెందిన తాము రూ.7 లక్షల జరిమానా ఎలా చెల్లిస్తామని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిర్ణయంతో తాము డ్రైవర్ వృత్తిని వదులుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు

బీజేపీ ప్రభుత్వ నిర్ణయం సరికాదు..

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం సరిగా లేదు. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్‌కు పదేండ్ల జైలు, రూ.7 లక్షల జరిమానా విధించడం సరికాదు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకంగా ఆదిలాబాద్ డిపోల అద్దె బస్సులను నిలిపివేశాం. కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, డ్రైవర్స్ కుటుంబాలు వీధిన పడకుండా చూడాలి.

- మాజిద్, అద్దె బస్సు డ్రైవర్ల సంఘం సలహాదారు, ఆదిలాబాద్ డిపో

కుటుంబాలు రోడ్డున పడుతాయి..

కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టం అమలు చేస్తే డ్రైవర్స్ కుటుంబాలు వీధిన పడుతాయి. జైలు శిక్ష విధిస్తే వారి కుటుంబాలను చూసే దిక్కు ఉండదు. కుటుంబాల పోషణ కోసం తక్కువ జీతాలతో పనిచేసే డ్రైవర్లు భారీ జరిమానా చెల్లించడం సాధ్యమయ్యే విషయం కాదు.

- చైతన్యరెడ్డి, ఆర్టీసీ అద్దె బస్సుల సంఘం ట్రెజరర్, ఆదిలాబాద్ డిపో

భైంసా డిపో ఎదుట నిరసన

భైంసా, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని బస్ డిపోలో ఎదుట 49 మంది అద్దె బస్సు డ్రైవర్లు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ.. చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇందులో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్, వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు

ఎదులాపురం, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షుడు దత్త అర్జునే పాల్గొన్నారు.

డ్రైవర్ వృత్తిని వదులుకోవాల్సిందే..

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం వల్ల డ్రైవర్ వృత్తిని వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మాకు నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల జీతం వస్తుంది. ఈ డబ్బులతో కుటుంబాలను పోషిస్తున్న తాము రూ.7 లక్షల జరిమానా ఎక్కడి నుంచి చెల్లిస్తాము. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరుతున్నా.

- సాయికుమార్, ఆర్టీసీ అద్దె బస్సుల సంఘం జనరల్ సెక్రటరీ, ఆదిలాబాద్ డిపో

.. మరిన్ని జిల్లా వార్తలు 8లో

పండుగ పూట పరేషాన్

సంక్రాంతికి అందని రేషన్ బియ్యం

- పది రోజులు గడుస్తున్నా సగం దుకాణాలకే సరఫరా
- చౌకధరల దుకాణాల చుట్టూ తిరుగుతున్న కార్డుదారులు
- రేపు, మాపు అంటూ చెబుతున్న రేషన్ దుకాణాదారులు
- బియ్యం లేక ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లు
- రైస్ రవాణాపై లారీ యజమానుల సమ్మే ప్రభావం కూడా కారణం

మంచిర్యాల, జనవరి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సంక్రాంతి పండుగ పూట రేషన్ దుకాణాలకు బియ్యం రాకపోవడంతో ప్రజలకు సరఫరా ఆలస్యం అవుతున్నది. పిండి వంటలకు బియ్యం అవసరం కావడంతో రేషన్‌కార్డుదారులు చౌకధరల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. సాధారణంగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందించాలి. ఇందుకోసం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ముందుగానే బియ్యం రేషన్ షాపుల్లోకి చేరుకోవాలి. డిసెంబర్ 31వ తేదీలోగా రావాల్సిన బియ్యం పది రోజులు గడుస్తున్నా రాలేదు. ఉమ్మడి జిల్లాలో సగం రేషన్ షాపులకు మాత్రమే బియ్యం వచ్చాయి. మిగిలిన వాటికి రాలేదు. బియ్యం కోసం అధికారులను అడిగినా, ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లినా.. ప్రయోజనం లేదని రేషన్ డీలర్లు వాపోతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం పంపిణీ ప్రక్రియ నడుస్తున్నది. మొన్నటి వరకు రేషన్ బియ్యం అందలేదు. ఇప్పుడు అన్ని షాపులకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. మంచిర్యాల జిల్లాలో సగం రేషన్ దుకాణాలకు మాత్రమే బియ్యం చేరాయి. పదో తేదీ ముగిసినప్పటికీ రేషన్ రాకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. సంకాంత్రి పండుగకు పిండి వంటలు చేసుకునేందుకు బియ్యం కోసమని వెళ్తే లేవని చెప్తుండడంతో ఏం చేయలేక ఖాళీ చేతులతో వెనుదిరుగుతున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్లకు నిలిచిన సరఫరా..

ప్రభుత్వం రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పంపించాల్సిన రేషన్ బియ్యం మూమెంట్ ఆలస్యమైంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం సకాలంలో రాలేదని, అందుకే రేషన్ దుకాణాలకు అందలేదని తెలుస్తున్నది. ఈ నెలకు సంబంధించిన బియ్యం రిలీజింగ్ ఆర్డర్(ఆర్‌వో) కూడా లేట్ అయ్యింది. జనవరి నెలకు సంబంధించిన ఆర్‌వో డిసెంబర్ 20వ తేదీలోపు రావాల్సి ఉండగా, నెలాఖరున రిలీజింగ్ ఇవ్వడంతో మూమెంట్ ప్రక్రియ వెనుకబడింది. మరోవైపు లారీల యాజమాన్యాలు సమ్మెలో ఉండడం కూడా బియ్యం రవాణాపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నది. బియ్యం సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నప్పటికీ లారీల కొరత వేధిస్తున్నది. మంచిర్యాల జిల్లాలో 423 రేషన్ దుకాణాలున్నాయి. వీటిలో 240 దుకాణాలకు సరఫరా పూర్తయ్యింది. మంచిర్యాలలోని ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో 142 రేషన్ దుకాణాలు ఉండగా 65 రేషన్ షాపులకు, తాండూర్‌లో 42 దుకాణాలకు 28, లక్షెట్టిపేట 81 దుకాణాలకు 32, బెల్లంపల్లిలో 72 దుకాణాలకు 57, చెన్నూర్‌లో 52 దుకాణాలకు 35, కోటపల్లిలో 34 దుకాణాలకు 23 షాపులకు పూర్తి స్థాయిలో బియ్యం సరఫరా అయ్యాయి.

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల దాడులు
- కడెంలో తహసీల్దార్, డీటీ
- పట్టా కోసం రైతు నుంచి రూ. 9 వేలు తీసుకుంటుండగా చిక్కిన అధికారులు
- బెల్లంపల్లిలో కాసిపేట పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి
- కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపునకు రూ. 15వేలు వసూలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు చోట్ల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. నిర్మల్ జిల్లా కడెం తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ చిన్నయ్య రైతు నుంచి రూ. 9 వేలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 15 వేలు తీసుకుంటూ కాసిపేట పీఆర్ ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు అడ్డంగా బుక్కయ్యారు.

పట్టుబడ్డ కడెం తహసీల్దార్ రాజేశ్వరి, పట్టుబడ్డ నగదుతో కాసిపేట పీఆర్ ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు

కడెం, జనవరి 10 : భూమి పట్టా విషయంలో రైతు నుంచి రూ. 9 వేలు తీసుకుంటూ కడెం రెవెన్యూ అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన లసెట్టి రాజన్న పెద్దనాన్న పేరుమీద ఉన్న 35 గుంటల భూమి పట్టా విషయంలో రెవెన్యూ అధికారులు వేధిస్తున్నారు. సర్వే నంబర్ 376లోని 5 గుంటలు, 373/2/2 లోని 24 గుంటలు, 376/2లోని 6 గుంటల భూమిని తన తమ్ముడు లసెట్టి సురేశ్ పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు గత నెల 28న ధరణి ద్వారా స్లాట్ బుక్ చేసుకున్నారు. గిఫ్ట్ భూమిని పట్టా చేయడం సాధ్యం కాదని, మూడు సర్వే నంబర్లకు గానూ ఒక్కోదానికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 15 వేలు ఇవ్వాలని లంచం డిమాండ్ చేశారు. ఈ నెల 9 వరకు కూడా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పని కాలేదు. దీంతో బాధిత రైతు ఈ నెల 9న కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఉదయం మళ్లీ పట్టా కోసం కడెం కార్యాలయానికి వెళ్లగా రూ. రూ. 9 వేలు ఇచ్చి పట్టా చేయించుకోమని అధికారులు చెప్పారు. దీంతో రూ. 9 వేలు తహసీల్దార్ రాజేశ్వరి సూచన మేరకు డీటీ చిన్నయ్యకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుకున్న నగదును స్వాధీనం చేసుకొని తహసీల్దార్, డీటీని కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలించారు. అక్కడి నుంచి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. అధికారులు అవినీతికి పాల్పడితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, 9154388963 సంప్రదించాలని ఆయన సూచించారు. ఏసీబీ ఎస్ఐలు జాన్‌రెడ్డి, రవీందర్, స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లిరూరల్, జనవరి 10 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెర్కపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రామగోని అశోక్‌గౌడ్ నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటున్న కాసిపేట పంచాయతీరాజ్ ఇంజినీర్ పోగుల పరంజ్యోతి, పెర్కపల్లి పంచాయతీ కార్యదర్శి కవటం వీరబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.15 వేలను వారి వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెర్కపల్లిలో పూర్తి చేసిన తెలంగాణ క్రీడాప్రాంగణానికి సంబంధించిన రూ 1.50 లక్షల మట్టి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు కోసం మేజర్‌మెంట్ బుక్ చేయడానికి కాంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారు. రెండేళ్లుగా బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో ఆయన ఏసీబీ అధికారులను సంప్రదించాడు. బుధవారం మధ్యాహ్నం బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద కాంట్రాక్టర్ అశోక్‌గౌడ్ నుంచి లంచం తీసుకుంటుండగా పంచాయతీరాజ్ ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి కవటం వీరబాబు అడ్డంగా దొరికిపోయారు.వీరి పై అధికారులు కేసు నమోదు చేశారు. అధికారులు లంచం అడిగితే బాధితులు అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ)ను ఆశ్రయించాలని ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ కోరారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 కి కాల్ చేయాలని, వెంటనే ఏసీబీ అధికారులు సత్వర న్యాయం అందిస్తారని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు జే రాము, ఏ.తిరుపతి, సునీల్, తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

- జడ్పీ సభ్యులు లేవనెత్తిన వాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి..
- నిర్మల్ జడ్పీ సమావేశంలో చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు
- సమావేశానికి ఎమ్మెల్యేలు బొజ్జు, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి గైర్హాజరు
- చాలా మంది సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

కలెక్టర్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, సభ్యులు

నిర్మల్ టౌన్, జనవరి 10 : నిర్మల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్ట మొదటిసారిగా సమావేశం నిర్వహించినప్పటికీ అధికార పార్టీ ఎమ్మెల్యే బొజ్జుతో పాటు ముథోల్, నిర్మల్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి హాజరు కాలేదు. సభ్యుల హాజరు శాతం కూడా తక్కువగా ఉండడంతో బీఆర్ఎస్ పార్టీ సభ్యులే అధికంగా కనిపించారు. దళితులకు ఇచ్చిన మూడెకరాల భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని సోన్ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై వెంటనే చర్య తీసుకోవాలని కలెక్టర్ అధికారికి సూచించారు. ఆయకట్టు రైతులందరికీ కడెం, సదర్‌మాట్ కింద నీళ్లు ఇవ్వాలని జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కిషన్‌లు అధికారులకు విన్నవించారు. ఈ సమావేశానికి హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, వైస్ చైర్మన్ సాగర్ బాయి, అధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఇథనాల్ బాధిత రైతులు

సీఎం రేవంత్‌రెడ్డితో ఇథనాల్ రైతు జేఏసీ నాయకులు

దిలావర్‌పూర్, జనవరి 10 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను నిలిపివేయాలని కోరుతూ బుధవారం రైతు జేఏసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. చేల మధ్య పరిశ్రమను నిర్మిస్తున్నారని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, సారంగపూర్ జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, రైతు జేఏసీ నాయకులు కోడే నవీన్, సుఖేశ్, పవన్, నర్సయ్య, రోహిత్ ఉన్నారు.

ఆడబిడ్డగా అండగా ఉంటా..

- ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలి..
- పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం పాటుపడాలి..
- పార్లమెంటరీ స్థాయి కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క

నిర్మల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నిర్మల్ టౌన్, జనవరి 10 : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఆడబిడ్డగా అండగా ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటరీ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల్లో ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రానుందని భరోసా ఇచ్చారు. వచ్చే నెలలో సీఎం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తారని, తాను కూడా వారంలో రెండు రోజులు పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రికి సమస్యల వెల్లువ

మంత్రి సీతక్కకు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు సీతక్కకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ కారోబార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు ఉద్యోగభద్రత కల్పించాలని, ఆరోగ్య శ్రీ, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ రాజ్ ఉద్యోగులు, టీఎన్జీవోలు ఉద్యోగాల సంఘాల నాయకులు మంత్రిని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి రంగం సిద్ధం

క్యాంపునకు తరలిన అసమ్మతి కౌన్సిలర్లు

నిర్మల్, జనవరి 10(నమస్తే తెలంగాణ) : నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌పై అసమ్మతి కౌన్సిలర్లు తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఇందులో భాగంగానే దాదాపు 20 మందికి పైగా కౌన్సిలర్లు మంగళవారం క్యాంపునకు తరలి వెళ్లారు. వీరిలో 15 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం కౌన్సిలర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసానికి మొగ్గు చూపుతున్నారు. కాగా బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లకు ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లు మద్దతు పలుకుతున్నట్లు సమాచారం. అయితే ఇంకొంత మంది మద్దతును కూడ గట్టుకున్న తర్వాతనే అవిశ్వాస నోటీసు ఇచ్చేందుకు అసమ్మతి కౌన్సిలర్లు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.